సాక్షి తిరుపతి

శుక్రవారం । 22 । ఆగస్టు । 2025



పెట్టుబడులు కీలకం

వ్యక్తిగత ఆర్థిక భద్రతకు పెట్టుబడులు కీలకం అని తిరుపతి జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ అన్నారు. - 10లో



గఘన విజయం

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) తన సుదీర్ఘ అంతరిక్ష ప్రయాణంలో ఘన విజయాలు సాధించింది. - 10లో



ఉద్యోగ అవకాశాలు పుష్కలం

తిరుపతి జిల్లాలో భవిష్యత్‌లో ఉద్యోగావకాశలు పుష్కలంగా ఉంటాయని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. - 10లో

న్యూస్‌రీల్

అయ్యప్పకు మొక్కు చెల్లించుకున్న పెద్దిరెడ్డి



అయ్యప్పకు మొక్కులు చెల్లించుకుని శబరిమలై నుంచి తిరిగి వస్తున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

తిరుపతిమంగళం: కేరళలోని శబరిమలలో మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మొక్కు చెల్లించుకున్నారు. అయ్యప్ప మాల ధరించిన ఆయన ఇరుముడి కట్టుకుని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, ఎమ్మెల్సీ భరత్, మాజీ ఎంపీ రెడ్డెప్ప, అనుచరులతో కలసి మంగళవారం శబరిమలైకు బయలు దేరి వెళ్లారు. గురువారం వారు అయ్యప్పకు మొక్కులు చెల్లించి, దర్శనం చేసుకుని అక్కడి నుంచి తిరుపతికి తిరుగు ప్రయాణమయ్యారు.

అంతర్ జిల్లాల బదిలీలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ: జిల్లాలో అంతర్ జిల్లాల బదిలీలకు సంబంధించి అర్హులైన ఉపాధ్యాయ, ప్రధానోపాధ్యాయులు ఈ నెల 24వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ ఒక ప్రకటనలో తెలిపారు.

భక్తుడు మరచిపోయిన వస్తువుల అప్పగింత



భక్తుడు మరచిపోయిన వస్తువులను తిరిగి అప్పగిస్తున్న టీటీడీ ఉద్యోగులు

తిరుమల: తిరుమలలోని కృష్ణ సదన్ విశ్రాంతి గృహంలో ప్రకాశం జిల్లాకు చెందిన కల్లూరి వెంకట సుబ్బారావు అనే భక్తుడు గురువారం గదిలో మరచిపోయిన పర్సు, రూ.1.10 లక్షల విలువైన 12 గ్రాముల బంగారు బ్రాస్‌లెట్, చేతి గడియారాన్ని టీటీడీ సిబ్బంది తిరిగి అప్పగించారు. కృష్ణ సదన్‌లో అటెండర్‌గా పని చేస్తున్న మహిధర్ రెడ్డి వీటిని గుర్తించాడు. కార్యక్రమంలో పద్మావతి విచారణ కార్యాలయ సూపరింటెండెంట్ విజయ కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో సినీ ప్రముఖులు

చంద్రగిరి: తిరుచానూరు పద్మావతి అమ్మవారిని గురువారం సినీనటుడు నాగ చైతన్య, శోభిత దంపతులు, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ వేర్వేరుగా దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న వారికి ఆలయాధికారులు స్వాగతం పలికి, ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. సినీనటులను చూసిన భక్తులు వారితో కలసి పెద్ద ఎత్తున సెల్ఫీలను దిగేందుకు పోటీపడ్డారు.

ప్రైవేట్ స్కూల్‌పై ఐటీ దాడులు

కలువాయి(సైదాపురం): కలువాయిలోని ఓ ప్రైవేట్ స్కూల్‌పై గురువారం ఐటీ అధికారులు దాడులు చేశారు. రికార్డు రూమ్‌ను సీజ్ చేసి, వెళ్లినట్లు సమాచారం. ఆ సమయంలో ఐటీ అధికారులు మీడియాను అనుమతించలేదు. పాఠశాల యాజమాన్యం కూడా నోరు విప్పకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయమై ఎంఈఓను వివరణ కోరగా సమాధానం దాట వేశారు. మండల స్థాయిలో ఓ ప్రైవేట్ స్కూల్‌పై ఐటీ దాడులు చేయడంతో మిగిలిన ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

తెలుగుగంగ కాలువ పరిశీలన



తెలుగుగంగ కాలువ మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

చిట్టమూరు: మండలంలోని వడ్డికండ్రిగ గ్రామం వద్ద అసంపూర్తిగా ఉన్న తెలుగుగంగ కాలువను తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ గురువారం పరిశీలించారు. 7వ బ్రాంచి కెనాల్ నుంచి తీర ప్రాంత గ్రామాల చెరువులకు తెలుగుగంగ నీరు సరఫరా అయ్యేందుకు అడ్డుగా ఉన్న 400 మీటర్ల పొలాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఇప్పటికే కాలువ తవ్వేందుకు 400 మీటర్ల పొలం సేకరించామన్నారు. అయితే ఆ పొలంలో ఒకరు సాగు చేస్తున్నారని, పొలం పట్టా మరొకరి పేరుపై ఉండడంతో పరిహారం నగదును చెల్లించలేదన్నారు. రెవెన్యూ అధికారులు సర్వే చేసి ఈ పొలం ఎవరికి చెందుతుంతో గుర్తించి వారికి నగదను చెల్లించి కాలువ పనులు పూర్తి చేయాలని సూచించారు. గూడూరు సబ్ కలెక ర్ రాఘవేంద్ర మీనన్, తహసీల్దార్ కాయల స తీష్ కుమార్, ఎంపీడీఓ మనోహర్ గౌడ్, తెలుగుగంగ వెంకటగిరి డివిజన్ ఈఈ రాధాకృష్ణమూర్తి, డీఈ నాగేశ్వరావు, ఏఈ మునిజ్యోతి బాబు పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న భూమన అభినయరెడ్డి, పార్టీ నేతలు, సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న దివ్యాంగులు

కూటమి వైకల్యంపై
దివ్య సమరం

- నాలుగు గంటలు కలెక్టరేట్ వద్ద ధర్నా
- న్యాయం కోసం.. దివ్యాంగులు, రోగులు పోరాటం
- దివ్యాంగులకు వైఎస్సార్‌సీపీ, సీపీఎం, కలెక్టరేట్ ఉద్యోగులు మద్దతు
- తప్పకుండా న్యాయం చేస్తామని కలెక్టర్ భరోసా

కలెక్టర్ భరోసా ఇస్తేనే కదులుతాం



ధర్నాకు వస్తున్న దివ్యాంగుడు

తిరుపతి అర్బన్: న్యాయ పోరాటానికి అంతా మద్దతు ఇవ్వండి.. ఒక్కసారి మమ్మల్ని చూడండి.. మానసిక, శారీరక రోగాలతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని జీవనం సాగిస్తున్నాం..ఎప్పుడు ఉంటామో..ఎప్పుడు పోతామో తెలియని స్థితిలో బతుకుతున్నాం. నిత్యం వైద్య పరీక్షలు చేయించుకుంటూ చాలీచాలనీ పింఛన్లతో జీవనం సాగిస్తున్నాం. అయితే కూటమి సర్కారు మాపై కక్ష కట్టింది. ఎవరిపైనో ఉన్న కక్ష మాపై చూపుతోంది. మేమంతా ఏ పార్టీకి చెందిన వాళ్లం కాదు.. ఏ నాడు ఏ జెండాతోను తిరగలేదు. అయినా రీవెరిఫికేషన్ అనే భూతాన్ని మాపై వదిలింది. వైద్య బృందాలు అడ్డదిడ్డంగా మా వైకల్యాన్ని తగ్గించి మా జీవితాలను అంధకారంలోకి నెట్టేశాయి. చంద్రబాబు సర్కార్ వాస్తవాలను గుర్తించాల్సి ఉంది. న్యాయం కోసం వ్యాధిగ్రస్తులు, దివ్యాంగులు గురువారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్నాం. గోవిందా.. గోవిందా ఏడుకొండల వాడా శ్రీవేంకటేశ్వరస్వామీ మాపై దయచూపండి.. మమ్మల్ని రక్షించండి..మా పింఛన్లు మాకు ఇప్పించండి అంటూ వేడుకోవడంతోపాటు సర్కార్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున దివ్యాంగులు నినాదాలు చేశారు.. వద్దు వద్దు మాకు ఈ సర్కా ర్ అంటూ అంతా గళమెత్తారు. వికలాంగుల పింఛన్లు తిరుపతి జిల్లాలో ఏడు వేల వరకు తొలగించారు. దేశ చరిత్రలో ఇంత దారుణం ఏ రాష్ట్రంలోనూ జరగలేదని దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేశారు.

తమ హక్కుల పరిరక్షణకు.. ఆగిపోనున్న తమ పింఛన్ తిరిగి రాబట్టుకోవడానికి..తమకు జరిగిన అన్యాయాన్ని ఎదిరించడానికి.. కూటమి కుట్రలు, కుతంత్రాలు ఎండగట్టడానికి.. అవయవాలు పనిచేయకపోయినా.. కాలం కలిసిరాకపోయినా.. మొక్కవోని ఆత్మస్థైర్యంతో దివ్యాంగులు జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చారు. కలెక్టరేట్ ఎదుట బైఠాయించి, ధర్నా చేశారు.

కలెక్టరేట్‌లో నాలుగు గంటలు ధర్నా

కలెక్టరేట్‌లో ఉదయం 9.45 నుంచి మధ్యాహ్నం 1.50 గంటల వరకు వ్యాధిగ్రస్తులు, దివ్యాంగులు ధర్నా చేశారు. కలెక్టర్ వెంకటేశ్వర్ వచ్చి తమ పింఛన్లకు భరోసా ఇస్తేనే కదులుతామని భీష్మించారు. రెండు గేట్లకు అడ్డంగా కూర్చోవడంతో ఉద్యోగులు, ప్రజలు కలెక్టరేట్‌లోకి వెళ్లి, రావడానికి వీలులేకుండా పోయింది. అయితే కలెక్టరేట్ ఉద్యోగులు సైతం వారు చేస్తున్న పోరాటాం న్యాయబద్ధంగా ఉందంటూ బాహటంగానే అన్నారు. గంటల కొద్ది ఉద్యోగులు కార్యాలయం వద్ద వేచి ఉండిపోయారు. ఈ సందర్భంగా ఐదుగురికి అవకాశం ఇస్తామని అర్జీలతో కలెక్టరేట్‌లోకి వెళ్లాలని తిరుచానూరు పోలీసులు దివ్యాంగులకు తెలియజేశారు. అయితే కలెక్టర్‌గారు వచ్చే వరకు కదలమని వారంతా 4 గంటలు అక్కడే ఉండిపోయారు. ఎండకు తట్టుకోలేక కొందరు అక్కడే పడుకున్నారు. ఈ క్రమంలోనే ఐరాలకు చెందిన సుమతి అనే దివ్యాంగురాలు స్పృహ కోల్పోయారు. ఆమెను పోలీస్ వాహనంలో ఆస్పత్రికి తరలించారు. డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శోభనబాబు, జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు వారి వద్దకు వచ్చి అర్జీలను ఇవ్వాలని కోరారు. అందుకు వారు నిరాకరించారు. తర్వాత డీఆర్వో ఫోన్ నుంచి కలెక్టర్ వెంకటేశ్వర్ దివ్యాంగులతో మాట్లాడి తప్పకుండా అందరితో చర్చించి న్యాయం చేస్తామని భరోసా ఇవ్వడంతో మధ్యాహ్నం 1.50 గంటల సమయంలో ధర్నాను విరమించారు.

సర్వం కోల్పోతున్నాం!

ఈ ప్రభుత్వంలో సర్వం కోల్పోతున్నాం.. 80 శాతం కంటే తక్కువ వికలత్వం ఉంటే ప్రభుత్వ పథకాలు రావు, కళాశాలల్లో సీట్లు కేటాయింపు ఉండదు..రిజర్వేషన్ కోల్పోతాం..చివరికి మూడు చక్రాల వాహనాలను అందుకోలేమంటూ దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టరేట్ ఎదుట దివ్యాంగులు, వ్యాధిగ్రస్తులు పింఛన్ల తొలగింపునకు నిరసనగా ధర్నా చేసిన క్రమంలో కలెక్టర్ వారికి ఫోన్‌లో ఒకటి లేదా రెండు సమావేశాలు నిర్వహించి, న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో మధ్యాహ్నం 4 గంటల సమయంలో కలెక్టర్ ఆదేశాల మేరకు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ వినోద్‌తో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల జేఏసీ స్టేట్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌తోపాటు మురళి, మురళీగౌడ్, శ్రీనివాసులు దృష్టికి దివ్యాంగులు తమ సమస్యలను తీసుకెళ్లారు. తిరుపతి జిల్లాలో 7 వేల పింఛన్ల తొలగించడం న్యాయమా? అని నిలదీశారు. జిల్లాలోని సమస్యలను ఉన్నతాధికారులకు తెలియజేయాలని ఏడీ వినోద్‌కు వివరించారు. వచ్చే సోమ లేదా మంగళవారం మరోసారి కలెక్టరేట్‌లో దివ్యాంగులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. అయితే దివ్యాంగులు మాత్రం వచ్చే సెప్టెంబర్‌లో తమకు పింఛన్లు తొలగిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు.



విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఏడీ వినోద్‌తో చర్చిస్తున్న దివ్యాంగులు

వైఎస్సార్‌సీపీ మద్దతు...

తిరుపతి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి, తిరుపతి నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, పార్టీ నేతలు తమ్ముడు గణేష్, సాయి కుమారి, ఇమ్రాన్‌బాషా, తిరుమలరెడ్డి, పసుపులేటి సురేష్, మద్దాలి శేఖర్, పుష్పలత తదితరులు వారికి మద్దతు తెలిపారు. అలాగే సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు వారికి అండగా నిలిచారు.

రూ.15వేలు నుంచి రూ.6 వేలు చేశారు



నా ఆరోగ్యం సరిలేదు. దాంతో నాకు రూ.15 వేలు ఫించన్ వస్తుంది. అయితే సెప్టెంబర్ నుంచి రూ.6 వేలు ఇస్తామని చెబుతున్నారు. నేను ఎలా జీవించాలి. 15 వేలు వైద్య ఖర్చులకు సరిపోవడం లేదు. సదరం సర్టిఫికెట్లలో వైకల్యం శాతం తగ్గించారు. మళ్లీ ఆస్పత్రికి వెళ్లమని చెబుతున్నారు. దిక్కుతోచని స్థితిలో న్యాయం కోసం ధర్నాకు వచ్చాం. నాకు న్యాయం చేయండి సార్. – మస్తాన్ సాహెబ్, వ్యాధిగ్రస్తుడు, దామలచెరువు

89 శాతం నుంచి 85 చేశారు



పక్షవాతంతో మంచానికే పరిమియం అయ్యాను. నాకు రూ.15 వేలు పింఛన్ వస్తుంది. అయితే రూ.6 వేలకు తగ్గించారు. వివిధ రోగాలతో తిప్పలు పడుతున్నాను. పింఛన్ తగ్గిస్తే వైద్య సేవల కోసం అప్పులు చేయాల్సిందే. అయినా అప్పు ఇచ్చేవారు లేరు. మాకు న్యాయం చేయండి. న్యాయంకోసం తిరుపతి కలెక్టరేట్ ధర్నాకు వచ్చాం. – కసల అహ్మద్, వ్యాధిగ్రస్తుడు, పాకాల మండలం

పింఛన్ తొలగించారు



దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలు ఇస్తున్నారు. అయితే ఇటీవల చేసిన వెరిఫికేషన్‌లో వికలత్వం తగ్గిందంటూ సెప్టెంబర్ నుంచి పింఛన్ ఇవ్వమని చెప్పడంతో ఆందోళనతో కలెక్టరేట్ ధర్నాకు వచ్చాం. నాకు న్యాయం చేయండి. పింఛన్ రాకుంటే నా జీవనం ప్రశ్నార్థకమే. – సోమశేఖర్, దివ్యాంగుడు, గాంధీనగర్, తిరుపతి రూరల్

న్యాయం కోసం కలెక్టరేట్‌కు వచ్చా




మూగ, చెవుడుతో బాధపడుతున్నాను. ప్రతి నెల రూ.6వేలు దివ్యాంగుల పింఛన్ ఇస్తున్నారు. 80 శాతం వికలత్వం ఉన్నట్లు గతంలో సర్టిఫికెట్ ఇచ్చారు. తాజా సర్వేలో 75శాతం వికలత్వం ఉన్నట్లు సదరం సర్టిఫికెట్ ఇచ్చారు. దీంతో పింఛన్ తొలగించడంతో తండ్రితో కలసి న్యాయం కోసం కలెక్టరేట్‌లో జరిగిన ధర్నాలో పాల్గొన్నాను. – భువనశ్రీ, తిరుచానూరు

వైకల్యశాతం తగ్గించి..పింఛన్ తొలగించారు



నాకు పింఛన్ ఎంతో ఆధారంగా ఉండేది. దాన్ని తొలగించారు. డాక్టర్లు 51 శాతం వైకల్యం ఉన్నట్లు సదరం సర్టిఫికెట్ ఇచ్చారు. డాక్టర్లు అడ్డదిడ్డంగా సదరం సర్టిఫికెట్లను జారీ చేశారు. దాంతో రూ.6 వేలు పింఛన్ తొలగించారు. ఏళ్ల తరబడి పింఛన్ తీసుకుంటున్నాను. ప్రస్తుతం తొలగిస్తే ఎలా బతకాలి. ప్రభుత్వం దివ్యాంగులకు అన్యాయం చేస్తోంది. –జ్యోతీశ్వర్‌బాబు, పాకాల

ఏడుకొండలవాడా.. దివ్యాంగులను కాపాడు



వేంకటేశ్వరస్వామి దివ్యాంగులను కాపాడాలని వేడుకుంటున్నాం. ఈ కూటమి ప్రభుత్వం మాకొద్దు. ఓట్లు వేసి గెలిపిస్తే.. దివ్యాంగులను రోడ్లపై కుర్చోబెట్టారు. 4 గంటల పాటు ఎండలో ధర్నా చేసి పలువురు రోగులు నానా ఇబ్బందులు పడ్డారు. అయినా అధికారులకు కనికరం లేదు. కూటమి ప్రభుత్వం దివ్యాంగులపై కక్షకట్టినట్లు భావిస్తున్నాం. న్యాయం కోసం పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తాం. – చంద్రశేఖర్, దివ్యాంగుల జేసీసీ రాష్ట్ర అధ్యక్షుడు

దివ్యాంగుల జీవితాలు అంధకారం



అనేక ఆరోగ్య సమస్యలతో అవస్థలు పడుతున్న దివ్యాంగుల జీవితాలను కూటమి ప్రభుత్వం అంధకారంలోకి నెట్టేస్తోంది. అయినా కనికరం లేకుండా ఫించన్లు తొలగించారు. మేమంతా ఏ పార్టీకి చెందినవాళ్లం కాదు. మా జీవనమే కష్టంగా ఉంది. ఏ పార్టీకి చెందిన ముఖ్యమంత్రులు ఇలా దివ్యాంగుల పింఛన్లు తొలగించలేదు. చంద్రబాబునాయుడు ప్రభుత్వం ఇలా చేయడం న్యాయం కాదు. – మధులత, దివ్యాంగుల సేవా సమితి జిల్లా మహిళా అధ్యక్షురాలు

వికలత్వం తగ్గించడం భవితకే ప్రమాదకరం



దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం వికలత్వాన్ని తగ్గించడం చాలా ప్రమాదం. పింఛను పోవడమే కాదు. భవిష్యత్తులో యువకులైన దివ్యాంగులకు కళాశాలల్లో ఉన్నత చదువులకు సీట్లు దక్కవు. ఉద్యోగాలు రావు. ప్రభుత్వ పథకాలు అన్నింటికి అనర్హులుగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. దివ్యాంగుల జీవితాలు అంధకారం చేయనున్నారు. న్యాయం కోసం పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తాం. – మురళీగౌడ్, దివ్యాంగుల సేవా సమితి వ్యవస్థాపకుడు

ప్రాణాలు పోయేవరకు పోరాడుతాం



ఒకటి కాదు రెండు కాదు వేల సంఖ్యలో దివ్యాంగుల పింఛన్లు తొలగించారు. మా జీవనం ప్రశ్నార్థకంగా మారింది. దివ్యాంగులకు ఈ ప్రభుత్వం అన్యాయం చేస్తోంది. తొలగించిన అందరి పింఛన్లు తిరిగి ఇవ్వాలి. లేదంటే ప్రాణాలు పోయేవరకు పోరాటాలు చేస్తాం. – శ్రీనివాసులు, దివ్యాంగుల సేవా సమితి జిల్లా అధ్యక్షుడు

తవ్వుకో.. జేబు నింపుకో!

- యథేచ్ఛగా మట్టి తవ్వకాలు
- రేయింబవళ్లు లారీలు, టిప్పర్లతో తరలింపు



రోసనూరు అటవీ భూముల్లో అక్రమ గ్రావెల్ తవ్వకాలతో ఏర్పడిన గుంతలు

పెళ్లకూరు: కూటమి సర్కారు అండతో ఓ టీడీపీ నేత కొండలు, గుట్టలు, చెరువులు, కాలువలు, అటవీ భూములను భారీ యంత్రాలతో గ్రావెల్, మట్టిని తవ్వి, నాయుడుపేట, దొరవారిసత్రం, మేనకూరు ప్రాంతాల్లో వెంచర్లు, పరిశ్రమలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. చెరువుల్లో గ్రావెల్ తవ్వకూడదని కోర్టు ఆదేశాలున్నప్పటికీ ఇక్కడ కొందరు అధికార పార్టీ నేతలు గ్రావెల్ మాఫియాగా మారి, చెరువులను గుల్ల చేస్తున్నారు.

పట్టుకుంటారు..వదిలేస్తారు!

ప్రతి రోజు పదుల సంఖ్యలో లారీలు రాత్రి వేళల్లో రోసనూరు అటవీ ప్రాంతం నుంచి వేర్వేరు ప్రాంతాలకు గ్రావెల్, మట్టి అక్రమంగా తరలిస్తున్నాయి. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులు అప్పుడప్పుడు ఒకటో, అర వాహనాలు పట్టుకుని ఒక్కొక్క వాహనానికి రూ.వెయ్యి నుంచి రూ.2వేలు అపరాధ రుసుం విధించి, వాహనాలను రెండు గంటల వ్యవధిలోనే వదిలేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

స్వర్ణముఖినది నుంచి ట్రాక్టర్లతో నిత్యం అక్రమంగా ఇసుక రవాణా, రోసనూరు, రాజుపాళెం గ్రామాల నుంచి మట్టి, గ్రావెల్ అక్రమ రవాణా జరుగుతున్నా ఇక్కడి అధికారులు మాత్రం తమకు పట్టదన్నట్లుగా వ్యవహరించడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

రోసనూరు కేంద్రానికి ఆయనే రేరాజు

మండలంలోని రోసనూరు గ్రామం కేంద్రంగా గత ఐదు దశాబ్దాలుగా ఓ రేరాజు చీకటి రాజ్యాన్ని ఏలుతున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆపార్టీ కండువా కప్పుకుని సామాన్య జనాన్ని మభ్యపెట్టి గ్రావెల్, మట్టి అక్రమ తవ్వకాలు జోరుగా సాగిస్తూ ధనార్జనే లక్ష్యంగా దూసుకెళుతున్నారు. గ్రామానికి సమీపంలోని అటవీ భూములు, చెరువులు, తెలుగు గంగ పార్లుకట్టలపై మట్టిని యంత్రాలతో తవ్వి, లారీలు, టిప్పర్లతో దొరవారిసత్రం, నాయుడుపేటలో లేఅవుట్లకు అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రాజుపాళెం, రోసనూరు, కృష్ణప్పకండ్రిగ గ్రామాల్లో ఒక షాడో ప్రజాప్రతినిధిగా వ్యవహరిస్తూ గ్రావెల్, మట్టి తవ్వకాలు జోరుగా సాగిస్తున్నారు. అయినా అటువైపు అధికారులు కన్నెత్తి కూడా చూడడం లేదు. రాజుపాళెం చెరువుకట్ట అభివృద్ధి, జంగిల్ క్లియరెన్స్ పేరుతో కట్టపై ఉన్న రూ.లక్షలు విలువ చేసే చెట్లను నరికి, విక్రయించి సొమ్ము చేసుకున్నారు. తెలుగుగంగ కాలువ గట్టు, గ్రామ సమీపంలో ఉన్న ఫారెస్ట్ భూములు, గిరిజన కాలనీ సమీపంలోని చెరువు, దళిత కాలనీ దిగువ ప్రాంతంలో ఉన్న చెరువు, గ్రామ సమీపంలోని భూపతీశ్వర కొండ తదితర ప్రాంతాల్లో భారీ యంత్రాలతో మట్టి, గ్రావెల్ అక్రమంగా తవ్వి, ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.



రోసనూరు చెరువులో రాత్రి వేళ మట్టి తరలిస్తున్న టిప్పర్లు

చర్యలు తీసుకుంటాం

రోసనూరు, రాజుపాళెం పలు ప్రాంతాల్లోని అటవీ భూములు, అసైన్‌మెంట్ భూములు, తెలుగుగంగ పార్లు కట్టలు, చెరువుల్లో అక్రమ గ్రావెల్, మట్టి తవ్వకాలు, స్వర్ణముఖినది నుంచి అక్రమ ఇసుక రవాణాపై ఫిర్యాదులు వస్తున్నాయి. జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి అక్రమ గ్రావెల్, మట్టి తవ్వకాలకు పాల్పడుతున్న వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం. – హరికృష్ణ, తహసీల్దార్ పెళ్లకూరు

ప్రభుత్వం సహకరిస్తే ఎన్‌సీసీ మరింత విస్తరణ

- మీడియాతో ఎన్‌సీసీ డీడీజీ ఎయిర్ కమాండర్ నర్సింగ్ సైలానీ



మీడియాతో మాట్లాడుతున్న ఎన్‌సీసీ డీడీజీ ఎయిర్ కమాండర్ నర్సింగ్ సైలానీ

తిరుపతి సిటీ : రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తే ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌సీసీని మరింత విస్తరిస్తామని డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమాండర్ నర్సింగ్ సైలానీ తెలిపారు. ఆయన గురువారం ఎన్‌సీసీ నగర్‌లో మీడియాతో మాట్లాడారు. ఆధ్మాత్మిక పుణ్యక్షేత్రం తిరుపతి ఎన్‌సీసీ గ్రూపును తొలిసారి సందర్శించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణ, దేశభక్తి లక్ష్యంగా ఎన్‌సీసీలో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. తిరుపతి ఎన్‌సీసీ గ్రూపు ఆధ్వర్యంలో క్యాడెట్లకు మెరుగైన శిక్షణ ఇస్తున్నారని పేర్కొన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్లను సాంఘిక సంక్షేమ కార్యక్రమాల వైపు నడిపిస్తూ ఉత్తమ పౌరులుగా సమాజానికి అందిస్తుండడం అభినందనీయమన్నారు. గణతంత్ర దినోత్సవాల్లో తిరుపతి గ్రూపు నుంచి పెద్ద సంఖ్యలో పాల్గొనేందుకు కఠోర శిక్షణ ఇవ్వడంతో పాటు పోటీతత్వాన్ని ఎదుర్కొనే ధైర్యాన్ని నింపే ప్రయత్నం చేయడం శుభపరిణామమన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా విడిపోయిన అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక ఎన్‌సీసీ కమాండ్ కంట్రోల్ ప్రధాన కార్యాలయం ఏర్పాటుకు కృషి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాలలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఎన్‌సీసీ సేవలు మరింత పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహాయ సహకారాలు అవసరమన్నారు. తల్లిదండ్రులు, విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులను ఎన్‌సీసీ వైపు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఉన్నత చదువులు, ప్రభుత్వ ఉద్యోగ అవకాశాల్లో ఎన్‌సీసీ ధ్రువీకరణ పత్రాలు ప్రధాన భూమిక పోషిస్తున్నాయని తెలిపారు. సమావేశంలో తిరుపతి గ్రూప్ కమాండర్ కల్నల్ సతీందర్ దాహియా పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లోని 25 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 75,688 మంది స్వామిని దర్శించుకున్నారు. 29,099 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.45 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 15 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనమవుతోంది.

క్లుప్తంగా

గుప్తనిధులు తవ్వకాల కేసులో ఏడుగురి అరెస్టు


నిందితులతో సీఐ తిమ్మయ్య, ఎస్‌ఐ విశ్వనాథనాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ: పొలంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపిన కేసులో ఏడుగురు నిందితులను అరెస్టు చేసి, జేసీబీని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తిమ్మయ్య, ఎస్‌ఐ విశ్వనాథనాయుడు తెలిపారు. గురువారం స్థానిక పోలీసుస్టేషన్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. ఆలత్తూరు గ్రామానికి చెందిన చిల్లకూరి ఉమామహేశ్వర్‌రెడ్డి బావమరిది ధనంజయరెడ్డికి 30 ఎకరాల పొలం ఉంది. ఈ పొలంలో పురాతన తులసీకోట ఉండడంతో, తులసీకోట కింద నిధులున్నాయనే అనుమానంతో ఈ నెల 18వ తేదీన కొందరు రాత్రి జేసీబీతో తవ్వకాలు జరిపారు. దీంతో స్థానిక పోలీసు స్టేషన్‌లో తవ్వకాలపై ఉమామహేశ్వర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు రెడ్డిగుంటబాడవ గ్రామానికి చెందిన ఎ.గురవయ్య, బీ.గురవయ్య, ఓజిలి మండలం హరివరం గ్రామానికి చెందిన చంద్రశేఖర్, హరీష్, అశోక్, అనిల్, శేఖర్‌ను నిందితులుగా గుర్తించి, వారిపై కేసు నమోదు చేసి, అరెస్టు చేశారు. తవ్వకానికి ఉపయోగించిన జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పీఎస్‌ఐ సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీరామలో ఘనంగా ఓరియెంటేషన్ డే


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ మన్నెం రామిరెడ్డి

తిరుపతి సిటీ:స్థానిక కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కాలేజ్‌లో గురువారం మొదటి సంవత్సరం ఇంజినీరింగ్ కోర్సుల్లో అడ్మిషన్లు తీసుకున్న విద్యార్థుల కోసం ఓరియెంటేషన్ డే ఘనంగా నిర్వహించారు. కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులున్నాయని తెలిపారు. విద్యార్థులు తమ లక్ష్య సాధనకు అధ్యాపకులు సహాయ సహకారాలు అందిస్తారని పేర్కొన్నారు. ఆధునాతన టెక్నాలజీని అందుపుచ్చుకుని ఉన్నత లక్ష్యం వైపు అడుగులు వేయాలని సూచించారు. ఇక్కడ విద్యనభ్యసించిన ఎంతో మంది విద్యార్థులు దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో రాణిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఐఐటీ ప్రొఫెసర్ వాసుదేవరావు, డైరెక్టర్ మన్నెం అరవింద్‌కుమార్‌రెడ్డి, సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు సాంఘిక సంక్షేమశాఖ ప్రాంతీయ సదస్సు

తిరుపతి అర్బన్: రాయలసీమ జిల్లాల సాంఘిక సంక్షేమశాఖ అధికారులతో శుక్రవారం ప్రాంతీయ సదస్సు తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు సమావేశం జరపనున్నారు. ఉమ్మడి చిత్తూరు, నెల్లూరు, అనంతపురం, కర్నూలు జిల్లాల్లోని సాంఘిక సంక్షేమశాఖ అధికారులతో నిర్వహించే రీజినల్ కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డోలా శ్రీబాల వీరంజనేయస్వామి పాల్గొననున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ఆయన బైరాగిపట్టెడలోని నర్సింగ్ విద్యార్థులకు జర్మన్ భాష ఉచిత శిక్షణ ప్రారంభించనున్నారు.

గఘన విజయం

ఆర్యభట్ట ఉపగ్రహంతో తొలి అడుగు

- తూర్పు తీరాన శ్రీహరికోటలో రాకెట్ ప్రయోగ కేంద్రం
- ఆరు రకాల రాకెట్ల రూపకల్పన
- 102 ప్రయోగాలు
- 92 ప్రయోగాలు సక్సెస్
- 23న జాతీయ అంతరిక్ష దినోత్సవం


భారత్ ప్రయోగించిన మొట్టమొదటి ఉపగ్రహం ఆర్యభట్ట



మొట్ట మొదట ప్రయోగించిన నైక్ అపాచీ రాకెట్

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సుదీర్ఘ అంతరిక్ష ప్రయాణంలో ఎన్నో శ్లాఘనీయమైన విజయాలు సాధించింది. నాటి ఆర్యభట్ట నుంచి నేటి గగన్‌యాన్ వరకు అంతరిక్షయాత్ర నిరాటంకంగా కొనసాగిస్తోంది. ఇప్పటివరకు ఇస్రో సొంతంగా 102 ప్రయోగాలను చేసి ఎన్నో మైలురాళ్లను అధిగమించింది. 2008లో చంద్రయాన్–1, 2013లో మంగళ్‌యాన్– 1, 2019లో చంద్రయాన్–3, 2023లో చంద్రయాన్–3, సూర్యయాన్–1 పేర్లతో ఐదు గ్రహాంతర ప్రయోగాలు, ఈ ఏడాది గగన్‌యాన్ ప్రయోగానికి సిద్ధమవుతోంది. 1963 నవంబర్ 21 తేదీన ఇస్రో మొట్టమొదటిసారి రెండు దశలతో కూడిన సౌండింగ్ రాకెట్‌ను కేరళలోని తుంబా ఈక్విటోరియల్ రాకెట్ కేంద్రం నుంచి ప్రయోగించి విజయం సాధించారు. అమెరికా, రష్యా, జపాన్, పశ్చిమ జర్మనీ, ఫ్రాన్స్ దేశాలు సహాయ సహకారాలతో నైక్ ఆపాచీ రాకెట్‌ను ప్రయోగించారు. ఆ తరువాత డాక్టర్ విక్రమ్ సారాభాయ్ ఆధ్వర్యంలో తుంబాలో సౌండింగ్ రాకెట్ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకుని, 1967 నవంబర్ 20న రోహిణి–75 అనే సౌండింగ్ రాకెట్‌ను పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించి విజయం సాధించారు. ఆ తరువాత ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చి సంస్థను 1969లో భారత అంతరిక్ష పరిశోధన సంస్థగా పేరు మార్చారు. 1970లో డిపార్ట్‌మెంట్ స్పేస్ కమిషన్‌ను ఏర్పాటు చేశారు. 1963లో తుంబా నుంచి వాతావరణ పరిశీలన కోసం సౌండింగ్ రాకెట్ ప్రయోగాలతో మన అంతరిక్ష ప్రయోగాల వేట మొదలైంది.

తూర్పు తీర ప్రాంతంలో..

తుంబా రాకెట్ కేంద్రం పెద్ద ప్రయోగాలకు అనువుగా లేదని భారతదేశానికి మంచి రాకెట్ కేంద్రాన్ని సొంతంగా ఏర్పాటు చేసుకోవాలనే కృత నిశ్చయంతో డాక్టర్ విక్రమ్ సారాభాయ్, అప్పటి ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ 1969లో తొలుత పడమటి తీరం అంటే అరేబియా సముద్ర తీరప్రాంతంలో స్థలాన్వేషణ చేశారు. ముందుగా గుజరాత్‌లో ఏర్పాటు చేయాలని అనుకుని, అక్కడ గ్రావిటీ పవర్ ఎక్కువగా ఉండడంతో తూర్పు తీరం అంటే బంగాళాఖాతం తీరప్రాంతంలో స్థలాన్వేషణ చేశారు. తూర్పు తీరాన పులికాట్ సరస్సుకు బంగాళాఖాతానికి మధ్యలో 44 చదరపు కిలో మీటర్లు విస్తరించిన శ్రీహరికోట దీవి ప్రాంతం గుర్తించారు. ఈ దీవి భూమధ్య రేఖకు 13 డిగ్రీల అక్షాంశంలో ఉండడం, గ్రావిటీ పవర్ తక్కువగా ఉండడంతో రాకెట్ ప్రయోగాలకు అనువుగా ఉందని శ్రీహరికోటను ఎంపిక చేశారు. భవిష్యత్తు రాకెట్ ప్రయోగాలను దృష్టిలో పెట్టుకుని వాతావరణ పరిశోధనకు సుమారు 1,161 సౌండింగ్ రాకెట్లు ప్రయోగించిన తరువాత పెద్ద ప్రయోగాలకు శ్రీకారం చుట్టారు. శ్రీహరికోట రాకెట్ కేంద్రం నుంచి ఇప్పటివరకు 102 ప్రయోగాలు చేయగా 92 విజయవంతం అయ్యాయి. ఆరు రకాల రాకెట్‌ల ద్వారా 132 స్వదేశీ ఉపగ్రహాలు, 18 విద్యార్థులు తయారు చేసిన ఉపగ్రహాలు, 433 విదేశీ ఉపగ్రహాలు, 9 రీ ఎంట్రీ మిషన్లు, రెండు ప్రైవేట్ అంతరిక్ష సంస్థలకు చెంది ఉపగ్రహాలను ప్రయోగించి ప్రపంచంలోనే రెండోస్థానంలోకి చేరడం విశేషం.

ఆర్యభట్టతో తొలి అడుగు

బెంగళూరులో శాటిలైట్ తయారీ కేంద్రంలో 1975లో ఆర్యభట్ట ఉపగ్రహాన్ని తయారు చేసుకుని రష్యా నుంచి ప్రయోగించి అంతరిక్ష ప్రయోగాల వేటను ఆరంభించారు. అనంతరం శ్రీహరికోట రాకెట్ కేంద్రం పూర్తిస్థాయిలో నిర్మించిన తరువాత మొదటి ప్రయోగవేదిక నుంచి 1979 ఆగస్టు 10 ఎస్ఎల్‌వీ–3 ఇ1 పేరుతో రాకెట్ ప్రయోగాలకు శ్రీకారం చుట్టారు. దురదృష్ట వశాత్తూ ఆ ప్రయోగం విఫలం కావడంతో నాటి శాస్త్రవేత్తలు కుంగిపోయారు. ఒక అపజయం మున్ముందు విజయాలకు నాంది అన్నట్టుగా నాటి శాస్త్రవేత్తలు మొక్కవోని ధైర్యంతో 1980 జులై 18న చేసిన ఎస్ఎల్‌వీ ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించారు. దీంతో మన శాస్త్రవేత్తలు మరో అడుగు ముందుకేసి ఏఎస్ఎల్‌వీ, పీఎస్ఎల్‌వీ జీఎస్ఎల్‌వీ, ఎల్‌వీఎం–3, ఎస్ఎస్ఎల్‌వీ, హెచ్‌ఆర్ఎల్‌వీ లాంటి భారీ ప్రయోగాలు చేసేస్థాయికి ఎదిగారు. కమ్యూనికేషన్ శాటిలైట్స్ (సమాచార ఉపగ్రహాలు) రిమోట్ సెన్సింగ్ శాటిలైట్స్ (దూరపరిశీలన ఉపగ్రహాలు), ఇండియన్ రీజనల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టం (భారత క్షేత్రీయ దిక్సూచి ఉపగ్రహాలు), వాతావరణ పరిశోధనా ఉపగ్రహాలు, గ్రహాంతర ఉపగ్రహాలు (చంద్రయాన్–1, మంగళ్‌యాన్–1, చంద్రయాన్–2, చంద్రయాన్–3, సూర్యయాన్–1) లాంటి భారీ ఉపగ్రహాలను అత్యంత తక్కువ వ్యయంతో మొదటి ప్రయత్నంలోనే ఎన్నో విజయాలు సాధించారు. 2023 జులై 14న ప్రయోగించిన చంద్రయాన్–3 గత ఏడాది ఆగస్టు 23న చంద్రుడి ఉపరితలం దక్షిణ ధృవంపై ల్యాండర్ దించి రోవర్‌తో చంద్రుడిపై పరిశోధనలు చేశారు. ఆరోజును ప్రధానమంత్రి నరేంద్రమోదీ జాతీయ సైన్స్ దినోత్సవం (నేషనల్ స్పేస్ డే)గా ప్రకటించి, ఈ నెల 23న జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహించుకోనున్నారు.


షార్‌లో ఒకేసారి పది రాకెట్‌లను ట్రాకింగ్ చేయగలిగిన సామర్థ్యంతో నిర్మించిన మల్టీ ఆబ్జెక్టివ్ ట్రాకింగ్ రాడార్ కేంద్రం

శ్రీహరికోటలో అత్యాధునిక సౌకర్యాలు

- శ్రీహరికోటలో ఒకేసారి నాలుగు రాకెట్‌లను అనుసంధానం చేసుకునేలా నాలుగు వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్‌లు, రెండు ప్రయోగవేదికలు ఉన్నాయి. సంవత్సరానికి 12 ప్రయోగాలు చేసుకునే అత్యంత అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఉంది.
- రూ.300 కోట్లు వ్యయం చేసి, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రెండో ప్రయోగవేదికను నిర్మించారు. 2005 మే5న ఈ ప్రయోగవేదికను అప్పటి ప్రధానమంత్రి మన్‌మోహన్‌సింగ్ చేతులు మీదుగా ప్రారంభించి జాతికి అంకితం చేశారు.
- రాకెట్ ప్రయోగాల్లో కీలకపాత్ర పోషించే ఘన ఇంధన విభాగాన్ని ఇక్కడే ఏర్పాటు చేసుకున్నారు. శ్రీహరికోటలోని ఘన ఇంధనప్లాంటు ప్రపంచంలోనే అతి పెద్దది. ఒకేసారి పది రాకెట్ ప్రయోగాలకు సరిపడేలా ఘన ఇంధన సెగ్మెంట్లు తయారు చేసుకునే సామర్థ్యంతో నిర్మించారు. రాకెట్ ప్రయోగాల్లో రెండు, నాలుగు దశలో వినియోగించే ఘన ఇంధన దశలతో పాటు ఘన ఇంధన స్ట్రాపాన్ బూస్టర్లను కూడా తయారు చేసే విభాగం విషయంలో ఇస్రో ఎంతో పరిణితిని సాధించింది.
- రూ.20 కోట్ల వ్యయంతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన మిషన్ కంట్రోల్‌రూమ్ నిర్మించి 2012 జనవరి 02న అప్పటి రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ చేతులు మీదుగా దీన్ని ప్రారంభం చేసి జాతికి అంకితం చేశారు. ఈ మిషన్‌కంట్రోల్‌రూమ్‌ను ఆదిత్య–369 సినిమాల్లో టైమ్ మిషన్ డిజైన్‌లా ఈ భవనాన్ని నిర్మించారు.
- రూ.245 కోట్లు వ్యయంతో మల్టీ ఆబ్జెక్టివ్ ట్రాకింగ్ రాడార్ కేంద్రాన్ని నిర్మించారు. ఒకే సారి పది రాకెట్లను ట్రాకింగ్ చేసే సామర్థ్యం కలిగిన ఎంటీఆర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ప్రపంచంలో ఎంటీఆర్ ఉన్న రెండోదేశంగా ఇస్రో ఆవిర్భవించింది.
- రూ.628.95 కోట్లు వ్యయంతో ఒకే సారి రెండు రాకెట్లును అనుసంధానం చేసేందుకు రెండో వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్ (వ్యాబ్) నిర్మించగా దీన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో జాతికి అంకితం చేశారు.
- ఆర్ఎల్‌వీ–టీడీ ప్రయోగాత్మక ప్రయోగం సక్సెస్ అయినందున షార్‌లో స్పేస్ షటిల్ ప్రోగ్రామ్‌కు కూడా సన్నాహాలు చేస్తున్నారు. వ్యోమగాములను అంతరిక్షంలోకి తీసుకెళ్లే వ్యోమనౌకను ప్రయోగాత్మకంగా చేసి విజయం సాధించడంతో షార్‌లో మూడో ప్రయోగవేదికను నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రయోగవేదిక నుంచే రాబోయే పదేళ్లలో స్పేస్‌షటిల్ ప్రోగ్రాంలో వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపేందుకు గగన్‌యాన్ పేరుతో పలు ప్రయోగాలకు సిద్ధమవుతున్నారు.


ఆదిత్య–369 సినిమాలో టైమ్ మిషన్ ఆకారంతో షార్‌లో నిర్మించిన మిషన్ కంట్రోల్ సెంటర్


షార్‌లో నిర్మించిన రెండో వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్

ఉద్యోగ అవకాశాలు పుష్కలం


వాకాడు బ్యారేజ్‌ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

చిల్లకూరు:భవిష్యత్తు తరాల వారికి జిల్లాలో ఉద్యోగావకాశాలు పుష్కలంగా ఉంటాయని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. గూడూరు పట్టణంలోని దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాలలో గురువారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 18 బహుళ సంస్థల ప్రతినిధులు పాల్గొన్న ఈ మేళాకు 414 మంది అభ్యర్థులు హాజరు కాగా 278 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసి, నియామక పత్రాలు అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనన్, గూడూరు డీఎస్పీ గీతాకుమారి, నైపుణాభివృద్ధి అధికారి లోకనాథం, కళాశాల కరస్పాండెంట్ మోహర్మణి, కళాశాల కార్యదర్శి విద్యాసాగర్, ఎంపీడీఓ మధుసూదన్‌రావు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రూ.7 కోట్లతో బ్యారేజ్ మరమ్మతుకు ప్రతిపాదనలు

వాకాడు: స్వర్ణముఖి బ్యారేజ్ మరమ్మతులకు రూ.7 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపామని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. గురువారం ఆయన ఇరిగేషన్ అధికారులతో కలసి వాకాడు–స్వర్ణముఖి బ్యారేజ్‌ని పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇకపై ఏటా బ్యారేజ్ పరికరాల నిర్వాహణకు జిల్లా నుంచి రూ.12 లక్షలు కేటాయించడం జరుగుతుందన్నారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్ వాకాడులోని ప్రభుత్వాస్పత్రిని తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట ఇరిగేషన్ ఎస్ఈ రాధాకృష్ణ, ఈఈ బాబు, డీఈలు, ఎంపీడీఓ శ్రీనివాసులు ఉన్నారు.

సాగరమాల సర్వీసు రోడ్ల సమస్యలపై పరిశీలన

నాయుడుపేటటౌన్: సాగరమాల సర్వీసు రోడ్ల సమస్యలపై గురువారం కలెక్టర్ వెంకటేశ్వర్, ఆర్డీఓ కిరణ్మయి, ఎన్‌హెచ్ అధికారులు, తహసీల్దార్ రాజేంద్ర పరిశీలించారు. మండలంలోని నరసారెడ్డికండ్రిగ సమీపంలో సాగరమాల రహదారి వద్ద కలెక్టర్ రైతులతో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకున్నారు. సాగరమాల రహదారి నిర్మాణ పనులతో పొలాలకు ఇరువైపుల సర్వీసు రోడ్లు లేకుండా చేస్తున్న విషయం రైతు సంఘం నాయకులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సర్వీసు రోడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు కలెక్టర్ సానుకులంగా స్పందించారు. రైతుల సంఘం నాయకులు జలదంకి వెంకటకృష్ణారెడ్డి, సన్నారెడ్డి హరినాథ్‌రెడ్డి, కామిరెడ్డి మధుసూదన్ రెడ్డి, విజయసారథి రెడ్డి, మచ్చా భాస్కర్, శిరిష్ రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ మేరిగను పరామర్శించిన సజ్జల


ఆనందరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు


ఆనందరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి


ఆనందరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి

రాపూరు/సైదాపురం: ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌ను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పరామర్శించారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తండ్రి మేరిగ ఆనందరావు ఇటీవల మృతి చెందిన విషయం విదితమే. ఈ క్రమంలో గురువారం వైఎస్సార్ సీపీకి చెందిన అగ్రనేతలు రాపూరులోని లక్ష్మీపురంలోని మేరిగ నివాసంలో మురళీధర్ తండ్రి ఆనందరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మురళీధర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే అక్రమ కేసులు, దౌర్జన్యాలపై సజ్జల రామకృష్ణారెడ్డి ఆరా తీశారు. అనంతరం మాజీ ఉప ముఖ్య మంత్రి నారాయణస్వామి, జెడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి తదితరులు ఆనందరావు చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. మాజీ మంత్రి, జిల్లా కోఆర్డినేటర్ కారుమూరి వెంకట నాగేశ్వరావు, ఎమ్మెల్సీపర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, జిల్లా నేతలు ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి కలిసి రాపూరుకు చేరుకుని మురళీధర్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో రాపూరు,సైదాపురం, బాలాయపల్లి, డక్కిలి మండలాలకు చెందిన పార్టీ కన్వీనర్లు మధుసూధన్‌రెడ్డి, ఎం.రవికుమార్‌యాదవ్, వెందోటి కార్తీక్‌రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బత్తిన పట్టాభిరామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పాపకన్ను మధుసూదన్‌రెడ్డి,మండల కన్వీనర్ బోడ్డు మధుసూదన్‌రెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి దందోలు లక్ష్మీనారాయణరెడ్డి,వలంటరీ వింగ్ అధ్యక్షులు దుగ్గిరెడ్డి నరసింహరెడ్డి, నలమారు రామ్‌గోపాల్‌రెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు మోహన్‌రావు తదితరులున్నారు.

వృద్ధురాలి హత్య

తిరుపతి క్రైమ్: పది గ్రాముల బంగారం కోసం ఓ వృద్ధురాలిని హత్య చేసిన సంఘటన తిరుపతి నగరంలో గురువారం వెలుగులోకి వచ్చింది. తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం, అలిపిరి సీఐ రామకిషోర్ కథనం మేరకు.. సీపీఆర్ అర్బన్ డెవలప్‌మెంట్ బ్లాక్ నెంబర్ 'సి'లో నివాసముంటున్న షణ్ముగం కొంతకాలంగా పక్షవాతంతో మంచానికి పరిమితమయ్యాడు. ఆయన కుమారుడు శివానందన్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. షణ్ముగం అనారోగ్యంతో ఉండడంతో ఆయన చెల్లెలు ధనలక్ష్మి (73) కొంత కాలంగా అన్న వద్దనే ఉంటోంది. షణ్ముగం కోసం కుమారుడు శివానందన్ విజయవాడకు చెందిన రవి అనే కేర్‌టేకర్ నియమించాడు. అతనికి ప్రతి నెలా రూ.22 వేల జీతంతోపాటు ఇంటి వద్దనే ఉండేందుకు, భోజనం, వసతి సమకూర్చాడు. రవి దృష్టి ధనలక్ష్మి చెవిలో ఉన్న 10 గ్రాముల కమ్మలపై పడింది. బుధవారం రాత్రి కత్తితో వృద్ధురాలు ధనలక్ష్మి గొంతుకోసి ఆమె చెవిలో ఉన్న కమ్మలను లాక్కొని పారిపోయాడు. పక్షవాతంతో ఉన్న షణ్ముగం ఏమీ చేయలేని పరిస్థితిలో ఉండిపోయాడు. ఉదయం విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి వేలిముద్రలను సేకరించారు. ఇంట్లో వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. ప్రస్తుతం రవి పరారీలో ఉన్నాడని త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు పేర్కొన్నారు.

కలిమిలి కుటుంబానికి సజ్జల పరామర్శ


రాజేశ్వరి కుమార్తెలను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి దంపతులు

డక్కిలి: వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ సభ్యురాలు కలిమిలి రాజేశ్వరి కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి గురువారం పరామర్శించారు. ఇటీవల జెడ్పీటీసీ రాజేశ్వరి అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా గురువారం డక్కిలి మండలం చాపలపల్లి గ్రామంలో ఆమె ఉత్తర క్రియలు జరిగాయి. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి చాపలపల్లికి వచ్చారు. అనంతరం రాజేశ్వరి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. తరువాత రాజేశ్వరి భర్త, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కలిమిలి రామ్‌ప్రసాద్‌రెడ్డి, కుమార్తెలను పలకరించి కొంతసేపు వారితో మాట్లాడారు. ఆయన వెంట నెల్లూరు జెడ్పీ చైర్మన్ ఆనం అరుణమ్మ, జెడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్య నాయుడు, పెంచలకోన ఆలయ మాజీ చైర్మన్ నెల్లూరు రవీంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు కొడవలూరు ధనుంజయరెడ్డి, పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, బొలిగర్ల మస్తాన్ యాదవ్, ఎంపీపీలు తనూజరెడ్డి, గోను రాజశేఖర్, గూడూరు భాస్కర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దొంతు శారద, కలువాయి జెడ్పీటీసీ సభ్యుడు అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడులు కీలకం


తిరుపతి అర్బన్: వ్యక్తిగత ఆర్థిక భద్రతకు పెట్టుబడులు కీలకం అని జేసీ శుభం బన్సల్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సెబీ వారి ఆధ్వర్యంలో ప్రాంతీయ పెట్టుబడిదారుల సెమినార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పెట్టుబడులు పెట్టడం వ్యక్తిగత ఆర్థిక భద్రతకే కాకుండా, ఉద్యోగ విరమణ తర్వాత కూడా జీవన భద్రతకూ ఎంతో అవసరమని చెప్పారు. ప్రతి ఒక్కరూ కనీస రూ.వెయ్యి అయినా పెట్టుబడిగా పెట్టాలన్నారు. సెబి జనరల్ మేనేజర్ ఎంకే శ్రీకాంత్ , ఎన్ ఎస్‌డీఎల్ చీఫ్ రెగ్యులేటరీ అధికారి యస్.గ్యానాని, వైస్ ప్రెసిడెంట్ నారాయణ వెంకట్, నోడల్ ఆఫీసర్‌గా ఎల్డీఎం రవికుమార్ పాల్గొన్నారు.

ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్టు


ఎర్రచందనం దుంగలు, నిందితులతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

తిరుపతి మంగళం : ప్రకాశం జిల్లా గిద్దలూరు ఫారెస్ట్ డివిజన్‌లో ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేసి వారి నుంచి 26 ఎర్రచందనం దుంగలు, ఒక మోటారు సైకిల్‌ను గురువారం తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ ఎండీ షరీఫ్ ఆధ్వర్యంలో కడప సబ్ కంట్రోల్ ఆర్ఎస్ఐ పీ.నరేష్ బృందం బుధవారం రాత్రి నుంచి ప్రకాశం జిల్లా గిద్దలూరు ఫారెస్ట్ రేంజ్‌లోని బెస్తవారిపేట అటవీ పరిధిలో కూంబింగ్ చేపట్టారు. వీరు గుంతపల్లి బీటుకు చేరుకునేసరికి అక్కడ ఒక మోటారు సైకిల్ వద్ద కొంతమంది వ్యక్తులు గుమికూడి కనిపించారు. వారిని సమీపించడంతో, పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. వారిని వెంబడించిన టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ముగ్గురిని పట్టుకున్నారు. వారిని విచారించి, అక్కడే కల్వర్టు కింద దాచి ఉంచిన 26 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారు ప్రకాశం జిల్లా వాసులుగా గుర్తించారు. వారిని దుంగలతోపాటు మోటారు సైకిల్‌ను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు హెడ్ కానిస్టేబుల్ సుబ్రమణ్యం రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎంఈఏ 2025 అసోసియేషన్ ప్రారంభం


అసోసియేషన్‌ను ప్రారంభిస్తున్న ప్రముఖులు

తిరుపతి రూరల్: పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో మెకానికల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ అసోసియేషన్ (ఎంఈఏ) ప్రారంభోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఇండియన్ రైల్వే సర్వీస్ ఆఫ్ మెకానికల్ ఇంజినీరింగ్ చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్ అకాసి దేవసహాయం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ పి.మల్లికార్జున, అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ పి.స్నేహలత, ఉపాధ్యక్షురాలు పి.వింధ్య, కార్యదర్శి పి.హర్షిత, సహాయ కార్యదర్శులు ఎస్.రమ్యశ్రీ, ఇ.కీర్తి పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


హరిప్రసాద్ (ఫైల్)

చిల్లకూరు: మండలంలోని కమ్మవారిపాళెం సమీపంలోని చీమల తిప్ప వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెంది ఉన్నట్లు స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు గురువారం సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహం కాలి పోయి గుర్తు పట్టలేని విధంగా ఉండడంతో పోలీసులు పలు కోణాలలో విచారణ చేపట్టగా మృతుడు కోట పట్టణంలోని నల్లపరెడ్డి చంద్రశేఖరరెడ్డి కాలనీకి చెందిన చర్లగుంట హరిప్రసాద్(43)గా గుర్తించారు. అతడు ఎందుకు ఈ ప్రాంతంలోకి వచ్చి మృతి చెందాడనే విషయం తెలియడం లేదని, మృతదేహం కాలిపోయి గుర్తు పట్టలేని విధంగా ఉండడంతో అతను ఆత్మహత్యకు పాల్పడ్డాడా?, ఎవరైనా చంపి ఇక్కడకు తీసుకుని వచ్చి కాల్చివేశారా? అన్న కోణంలో విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.